

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని వైస్ ఎంపిపి వెంకట్రమణ అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ మండల అభివృద్ధే లక్ష్యంగా అందరం కలసి పని చేద్దామన్నారు. మండలంలో జ్వరాలు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, సర్పంచ్ గంగులమ్మ, వైస్ ఎంపిపి కిరణ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, ఎంపిడిఒ సుధాకర్ రెడ్డి, ఎఒ హేమలత, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి వెంకట రమణ

ప్రభుత్వ నూతన వైద్య కళాశాలలకు కసరత్తు

- అసంపూర్తిగానే పులివెందుల, మదనపల్లి కళాశాలలు
- నేషనల్ మెడికల్ కౌన్సిల్ సిఫారసు కోసం నిరీక్షణ
- సెప్టెంబర్‌లో తరగతుల నిర్వహణ దిశగా చర్యలు
- ఎంఎన్‌సికి ప్రభుత్వ లేఖపై ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలోని పులివెందుల, మదనపల్లి నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల కార్యకలాపాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఒక వైపు పూర్తి స్థాయిలో నిర్మాణానికి నోచని వైద్య కళాశాలల భవనాలు, మిషనరీ, ల్యాబ్స్, మరోవైపు అరకొర ఫ్యాకల్టీ, బోధనేతర సిబ్బంది నియామకాల గందరగోళంపై సందిగ్ధత నెలకొంది. సార్వత్రిక ఎన్నికల ముంగిట ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పులివెందుల మెడికల్ కళాశాలను ప్రారంభం చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మెడికల్ కళాశాలల అడ్మిషన్లకు అనుమతి తెలపాలని కోరుతూ నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాసిన నేపథ్యంలో కథనం...



పులివెందుల మెడికల్ కళాశాల

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లోని పులివెందుల, మదనపల్లి వైద్య కళాశాలల కార్యకలాపాల నిర్వహణకు కసరత్తు ఊపందుకుంది. 2019లో రూ.450 కోట్లతో పులివెందుల, రూ.వందల కోట్లతో మదనపల్లి వైద్య కళాశాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అనంతరం కరోనా విజృంభణతో వైద్య కళాశాల పనులు నిలిచిపోయాయి. కరోనా అనంతరం మూడేళ్లలో భవన నిర్మాణ పనుల్ని సుమారుగా పూర్తి చేయడం గమనార్హం. మొదటి సంవత్సర అడ్మిషన్లను దృష్టిలో ఉంచుకుని 90 శాతం మేరకు వైద్య కళాశాలల పనులు పూర్తి చేశారు. మిగిలిన పెండింగ్ పనుల్ని మరో రెండు ఫేజుల్లో పూర్తి చేయడంపై వైద్యకళాశాలల అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

రిక్రూట్‌మెంట్ అరకొరే!

నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రమాణాల మేరకు తరగతి గదులు, ఒటి, ల్యాబ్స్, లైబ్రరీ వంటి ఇతర సదుపాయాలను కలిగి ఉండాలి. నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలు కావడంతో ఎన్ఎంసి ప్రమాణాలను కలిగి ఉంటాయని చెప్పవచ్చు. వైద్యకళాశాలకు అవసర మైన మేరకు ఫ్యాకల్టీ, బోధనేతర సిబ్బంది నియామకాలను చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి వైద్య కళాశాలకు 222 మంది ఫ్యాకల్టీ, బోధనేతర సిబ్బంది కావాల్సి ఉండగా 98 మంది మాత్రమే నియామకం చేయడం గమనార్హం. పులివెందుల మెడికల్ కళాశాలకు 50 మంది ఫ్యాకల్టీని నియమించింది. మిగిలిన 72 మంది బోధనేతర సిబ్బంది నియామకంలో గందరగోళం నెలకొనడంతో వెర్ఫికేషన్ పేరుతో కాలయాపన కొనసాగుతోంది.

కొనసాగుతున్న వెర్ఫికేషన్!

సార్వత్రిక ఎన్నికల ముంగిట కడప, పులివెందుల మెడికల్ కళాశాలలకు సంబంధించి 198 మంది సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. రిక్రూట్‌మెంట్ చేయడంలో అనుభవజ్ఞుల సేవలు కొరవడిన నేపథ్యంలో ఫైనల్ లిస్టును విడుదల చేయడంలో గందరగోళం నెలకొంది. ఫలితంగా డిప్యూటీ సిఎం ఎస్‌బి.అంజాద్‌బాషా జోక్యం చేసుకోవడంతో కలెక్టర్ స్పందించి నలుగురు ప్రభుత్వ ఉన్నతాధికారుల పర్యవేక్షణతో వెర్ఫికేషన్ చేయించడం ఆందోళన కలిగిస్తోంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో వెరిఫికేషన్ తంత్రం సాగుతూనే ఉండడం గమనార్హం.

ఎన్ఎంసి తనిఖీ కోసం నిరీక్షణ

పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలల కార్యకలాపాలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో 15 రోజుల కిందటే ఎన్ఎంసి పరిశీలన చేయాల్సి ఉంది. ప్రభుత్వం నూతన వైద్య కళాశాలల అడ్మిషన్లకు ఆమోదం తెలపాలని కోరుతూ లేఖ రాసింది. నెలాఖరులోపు ఎన్ఎంసి ఇన్‌స్పెక్షన్ చేసే అవకాశం ఉంది. నూతన కళాశాలల అధికార యంత్రాంగం నిరీక్షిస్తోంది. ఇన్‌స్పెక్షన్ అనంతరం ఎంఎన్‌సి చేసిన సిఫారసుల ఆధారంగా అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఆగస్టులోపు అడ్మిషన్లకు అనుమతి లభిస్తే సెప్టెంబర్‌లో తరగతుల నిర్వహించే అవకాశం ఉంటుందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పులివెందుల వైద్య కళాశాలలో 100, మదనపల్లి వైద్య కళాశాలలో 150 మంది చొప్పున అడ్మిషన్లు ఇచ్చే అవకాశం ఉందనే అంచనాతో ముందుకెళ్తుండడం గమనార్హం.

ఎన్ఎంసి సిఫారసు తప్పనిసరి

పులివెందుల, మదనపల్లి ప్రభుత్వ వైద్య కళాశాల కార్యకలాపాల నిర్వహణకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆమోదం తెలపాలి. ఎప్పుడైనా నూతన వైద్య కళాశాలలను ఇన్‌స్పెక్షన్ చేయడానికి వచ్చే అవకాశం ఉంది. వైద్యకళాశాల నిర్వహణ కార్యకలాపాలకు అనుగుణంగా వైద్య కళాశాలల్లో శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

డాక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపల్, వైద్య కళాశాల, పులివెందుల.



నిర్మాణంలో ఉన్న మదనపల్లి మెడికల్ కళాశాల

కష్టజీవుల పక్షాన పోరాటం

వ్య.కా.స అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కష్టజీవుల పక్షాన నికరంగా పోరాటాలు చేస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన గురువారం అన్నమయ్య జిల్లా హార్సిలీహిల్స్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య 1934లో స్థాపించిన వ్యవసాయ కార్మిక సంఘం నేడు కోటి మంది సభ్యులతో దేశవ్యాపితంగా విస్తరించిందని పేర్కొన్నారు. దేశంలో నేటికీ 65 శాతంపైగా ప్రజలు వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఆ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే ఉద్దేశ్యంతో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతున్నదని, దానిపై ఆధారపడి జీవిస్తున్న ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, గ్రామీణ ప్రజల జీవితాల మెరుగుదల కోసం వ్యవసాయ కార్మిక సంఘం అనేక ఉద్యమాలు, పోరాటలు చేస్తున్నదని గుర్తుచేశారు. రాబోయే కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉద్యమాల రూపకల్పనకు హార్సిలీహిల్స్‌లో రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగు తున్నాయని తెలిపారు. వ్యవసాయ కూలీలు సాధించుకున్న పథకాలు రక్షించుకోవాలని అందుకోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని తెలిపారు. తగిన వర్షాలు లేక, అనావృష్టి వలన విపత్తు వచ్చినప్పుడు పేదలను ఆదుకున్నది ఉపాధి హామీ పథకమేనని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రజలను విస్మరించి మోసం చేస్తున్నాయని, మతోన్మాద బిజెపిని నెత్తిన ఎత్తుకొని ఊరేగుతున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల ఫలితాలలో ఎవరు గెలిచినా ప్రజలకు ఒరిగేది లేదని పేదల కోసం, వ్యవసాయ కూలీల రక్షణ కోసం ఉద్యమాలు తప్పవని పేర్కొన్నారు. భూమి, ఉపాధి పరిరక్షణకై వ్యవసాయ కూలీలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేసి పరిష్క రించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు విక్రమ్‌సింగ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పి.శ్రీనివాసులు, కె.రవి, కెవి.నారాయణ, ఆంజనేయులు, నాగే శ్వరరావు కోట కళ్యాణ్, పుల్లయ్య, సింహా చలం, ఓబుల రాజు పాల్గొన్నారు.



రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



విసిలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వివరించారు. గురువారం విజయవాడలోని సచివాలయం నుండి సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లు భద్రతా చర్యలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్‌తోపాటు డిఆర్ఒ సత్యనారాయణ రావు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌కు ముందుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ చిన్న చిన్న సంఘటనలు మినహా అందరి సమిష్టి కృషి, భాగస్వామ్యంతో ఈనెల 13న రాష్ట్రంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామన్నారు. అదే స్ఫూర్తితో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ప్రణాళిక మేరకు పటిష్టమైన ఏర్పాట్లు చేసుకొని కౌంటింగ్ ప్రక్రియను విజయ వంతం చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గద ర్శకాలను పాటిస్తూ త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాలను ప్రకటిం చేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ముందస్తుగా పటిష్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పాత్రికే యులకు ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సంద ర్భంగా అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ పార్ల మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం అన్నింటికీ రాయచోటి సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సిసి కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. పార్లమెంట్, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేశామని, ఇవిఎం స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ కేంద్రానికి ఇవిఎంలను తీసుకొచ్చే దారిలో సిసి కెమెరాలు, బ్యారికేడింగ్, కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించేందుకు ఏజెంట్లు అధికారులకు విడిగా బ్యారికేడింగ్ ఏర్పాటు చేశామని, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని, కౌంటింగ్ కేంద్రాలు స్ట్రాంగ్ రూముల వద్ద ప్రత్యేక భద్రత బలగాలను ఏర్పాటు చేశామన్నారు. మీడియా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంలలో పోలైన ఓట్ల కౌంటింగ్ కొరకు అదనంగా ఎఆర్ఒలను, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలి పారు. కౌంటింగ్ నిమిత్తం నియమించిన సిబ్బందికి శిక్షణ కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా సాఫీగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపాకలో వైభవంగా శ్రీవారి కల్యాణం

భక్తులకు శరణాగతి నేర్పిన అన్నమయ్య
విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి



తాళ్లపాకలో శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాలు గురు వారం అన్నమయ్య జిల్లా తాళ్ళపాకలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తాళ్లపాక లోని ధ్యాన మందిరం వద్ద ఉదయం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా నిర్వ హించారు. విశాఖ శారద పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రస్వామిస్వామీజీ పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు వేద పండితులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుల్లో ఒకరైన శ్రీ వేణుగోపాల్ దీక్షితుల ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. పుణ్య హవచనం, పవిత్రహోమం, కంకణ ధారణ, మాంగళ్యధారణ, మంగళాశాసనం ఘట్టాలతో శ్రీవారి కల్యాణం నిర్వహించారు. చివరిగా నక్షత్రహారతి, మంగళ హారతి కార్యక్రమంతో కల్యాణం ముగిసింది. భక్తులకు టిటిడి మంచినీరు, మజ్జిగ, ప్రసాదాలు అందించింది. శ్రీవారి కల్యాణం అనంతరం పెద్దసంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రస్వామిస్వామీజీ అనుగ్ర హభాషణం చేస్తూ, భగవంతుని తత్వాన్ని తెలుసుకునేందుకు శరణాగతి తప్ప మరో మార్గం లేదని భక్తులకు అన్నమయ్య తెలియజేశారన్నారు. 600 సంవత్సరాలకు పూర్వమే శ్రీవారి తత్వాన్ని, భక్తి, ప్రపత్తి, శరణాగతిని సామాన్యులకు అర్థమయంయ్యేలా చెప్పా రన్నారు. భగవంతునిపై పూర్తి విశ్వాసంతో నామసంకీర్తనం చేస్తే ముక్తి కలుగుతుందని అన్నమయ్య కీర్తనల ద్వారా అవగతమవుతుందని వివరిం చారు. అంతకుముందు అన్నమా చార్య ప్రాజెక్టు కళాకారులు ఉదయం 9 నుండి 10 గంటల వరకు సప్తగిరి సంకీర్తనా గోష్టిగానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన ఉదయభాస్కర్, హేమమాలిని సంగీత సభ, రాత్రి 7 గంటలకు తిరుపతికి చెందినశ్రీనివాస్ బృందం హరికథ గానం చేయనున్నారు. రాజం పేట-కడప హైవేలో ఉన్న 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శనివారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీవారి ఊంజల్‌సేవ వైభవంగా జరుగనుంది. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నారాయణస్వామి, నాగలక్ష్మీ బృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించనున్నారు. రాత్రి 7.30 గంటలకు తిరుపతికి చెందిన లక్ష్మీకుమారి బృందం హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి. కార్యక్రమంలో టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు డాక్టర్ విభీషణ శర్మ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీకాతో టిబి వ్యాధికి చెక్ పెడదాం : డిపిఎంఒ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి.టీకాల ద్వారా క్షయ(టిబి)వ్యాధికి చెక్ పెడదామని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డిపిఎంఒ) డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. గురువారం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని యుఎ హెచ్‌సి వాల్మీకివీధి పరిధిలోని రెడ్డివారిపల్లి, ఈడిగపల్లిలలో నిర్వహిస్తున్న వయోజన బిసిజి టీకా కేంద్రాన్ని డిఎన్ఎంఒ డాక్టర్ విష్ణు వర్ధన్‌రెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ లిస్ట్ ప్రకారం తనిఖీ చేశారు. అనంతరం హాజరైన ప్రజలకు అయన ఆధ్వర్యంలో వయోజన బిసిజి టీకాపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 16న ప్రారంభించి అర్హులైన లబ్ధిదారులకు బిసిజి.టీకాలు ఇచ్చారని టిబి మరణాల తీవ్రతను నివారించడంలో బిసిజి టీకా చాలా సురక్షితమైందని, క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి, పెద్దలలో టిడి నుంచి రక్షణ ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఎంతో ప్రయోజనకారి అని, ఎవరు ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా వేసుకోవచ్చునని పేర్కొన్నారు. 60 సంవత్సరాలుపై వృద్ధులకు, పొగ పీల్చేవారు, ,మధుమేహ వ్యాధిగ్రస్తులు, టిబి జబ్బుతో కోలుకున్న వారు, వారి కుటుంబ సభ్యులకు, వీరు టీకాకు అర్హులని, మీ రోజువారీ పనికి ఆటంకం,అసౌకర్యం ఉండదని చెప్పారు. ప్రభుత్వం అన్ని సాధారణ వైద్య సేవల్లో, ఆరోగ్య సంరక్షణకు చాలా మంచి కార్యక్రమమని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి స్ట్రీట్ వైద్యులు ,ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్త ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిపిఎంఒ రియాజ్‌బేగ్

ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆర్ఒలు, ఎఆర్ఒలు, నోడల్ అధికారులు మరియు ఇతర సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. గురువారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జూన్ 4న రాయచోటిలోని ఓట్ల లెక్కింపు కేంద్రమైన సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు గదులలో చేయబోయే ఏర్పాట్లు, లెక్కింపు ప్రక్రియ, తయారు చేయబోయే వివిధ ఫారంలు, లెక్కింపు ప్రక్రియ ముగిసిన అనంతరం తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై రాయచోటి మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, హరిప్రసాద్, ఆర్ఒలు, ఎఆర్ఒలు, నోడల్ అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పోలింగ్ ప్రక్రియను అధికారులందరూ సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. జూన్ 4వ తారీకు ఉదయం స్ట్రాంగ్ రూములను తెరవడం నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఇవిఎంలను వేర్ హౌస్‌కు తరలించేంతవరకు ప్రతి విషయంపై కూలంకషంగా అవగాహన ఉండాలన్నారు. అంతకుముందు రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, హరిప్రసాద్, ఆర్ఒలు, ఎఆర్ఒలు, నోడల్ అధికారులు, ఇతర సిబ్బందికి కండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ 1961, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమనిబంధనలను పాటిస్తూ నిర్వహించాల్సిన పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, ఇవిఎం ఓట్ల లెక్కింపు, తదితర అంశాలపై శిక్షణనిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న అభిషిక్త్ కిషోర్, చిత్రంలో ఎస్‌పి కృష్ణారావు

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ఓట్ల లెక్కింపు రోజు శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓట్ల లెక్కింపు రోజున శాంతి భద్రతలపై జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ ఎస్‌పి కృష్ణారావుతో కలిసి ఆర్ఒలు, రాయచోటి, మదనపల్లి, రాజంపేట డిఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ జూన్ 4న ఆర్ఒలు, డిఎస్‌పిలు సమన్వయంతో శాంతిభద్రతలను పరిరక్షించాలని, సెక్షన్ 144ను పటిష్టవంతంగా అమలు చేయాలని, ఎటువంటి సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 6వ తేదీ వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందని గుర్తు చేశారు. ఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున మూడంచల భద్రతతో కూడిన అవసరమైన బారికేడింగు, సెక్షన్ 144 అమలు తదితర అంశాలపై పూర్తి ప్రణాళికతో సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో ఎక్కడ ఏ చిన్న పొరపాటు లేకుండా చూసుకోవాలని డిఎస్‌పిలను, ఇతర పోలీసు అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణరావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందుకుంటున్న వినయ్

ప్రజాశక్తి-నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న నందలూరు ప్రీమియర్ లీగ్ 8 సీజన్ హార్డ్ టెన్నిస్ క్రికెట్ బాల్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన మ్యాచ్లో గాంధీ నగర్ 11 తోట పాలెం వర్సెస్ నారాయణరాజుపేట జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ లెవెన్ 119 పరుగులు చేసింది.తర్వాత నారాయణరాజుపేట జట్టు 85 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచిన గాంధీనగర్ లెవెన్ జట్టులోని వెంకటేష్‌కు మ్యాన్ఆఫ్‌దిమ్యాచ్ అవార్డును రాజంపేట, పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్, సుబ్బా నరసారెడ్డి చేతులమీదుగా అందజేయడం జరిగింది. మధ్యాహ్నం మంటపంపల్లె కింగ్స్ డాబా 11 జట్టు, నందలూరు ఎఇ 11 జట్ల మధ్య పోటీ ఆసక్తికరంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన మంటపం పల్లె జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 196 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ దిగిన నందలూరు జట్టు 13.2 ఓవర్లలో 82 పరుగులకు ఆల్ అవుట్ అయి పరాజయం చెందింది. మంటపంపల్లె జట్టులోని వినయ్ 52 పరుగులు చేయడంతో పాటు మూడు ఓవర్లు బౌలింగ్ చేసి ఏడు వికెట్లను పడగొట్టి అసిస్టెంట్ క్రికెట్ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడీ చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నాడు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్, శివకోటి పాల్గొన్నారు.



గొర్రెకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

చిటికె వ్యాధి నివారణకు టీకా వేయించాలి

ప్రజాశక్తి-రామాపురం

గొర్రెలు, మేకలకు చిటికె వ్యాధి సోకుండా నివారించడం కోసం టీకాలు తప్పనిసరిగా వేయించాలని అన్నమయ్య జిల్లా పశువర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. మండలంలో గురువారం గోపగుడిపల్లి, నీలకంఠరావుపేట, బి.రాచపల్లి గ్రామాలలో జరుగుతున్న వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 53వేల గొర్రెలు, మేకలు ఉన్నాయని అన్నారు. మొదటి విడతలో 20వేల గొర్రెలకు వ్యాక్సిన్ వచ్చిందని వివరించారు. వీటికి చిటికె వ్యాధి సోకకుండా ఉండడానికి మొదటి విడతగా గతంలో చిటికె వ్యాధి వ్యాపించిన గ్రామాలలో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రెండవ విడతలో మిగిలిన గ్రామాల్లో గొర్రెలకు టీకాలు వేస్తామని తెలిపారు. గొర్రెల పెంపకం దారులు తప్పక టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి పశువర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ మాలకొండయ్య, మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, పశుసంవర్ధక శాఖ సహాయకులు రేవతి, రాజకుమారి, మహేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-గాలివీడు

పదవతరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటిలో నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ పిల్లి నాగరాజు పేర్కొన్నారు. పదో తరగతిలో 78 మంది ఫెయిల్ వారికి రాయచోటిలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 9:30 నుండి12:45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని అన్నారు. 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు కూడా ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ప్రథమ సంవత్సరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయని అన్నారు. హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రేపటి నుంచి ధనకొండ గంగాభవాని జాతర

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని అరవీడు పంచాయతీ కసిరెడ్డిగారిపల్లి వెనుకవైపున వెలసిన కుషావతిని ఒడ్డున ధనకొండ గంగాభవాని జాతర శని, ఆదివారాలలో నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది, కుంకుమ బండి కొత్త రథాన్ని కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. శనివారం రాత్రి చాందిని బండ్లు దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారని, ఆదివారం ఉదయం కుంకుమ బండి రథం ద్వారా ప్రదర్శనలు నిర్వహిస్తారని చెప్పారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు.

జూన్ 9 వరకు టపాసులు పేల్చడం నిషేధం

ప్రజాశక్తి-కలకడ

వచ్చేనెల 9వ తేదీ వరకు టపాసులు పేల్చడం నిషేధమని తహశీల్దార్ ప్రియదర్శిని ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చే నెల 9వ తేదీ వరకు మండలంలో ఎక్కడ గాని టపాసులు విక్రయించడం, తయారు చేయడం, పేల్చడం వంటివి చేసినచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 13 వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా వచ్చే నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఇందు కోసం గెలుపొందిన అభ్యర్థులు, వారి కార్యకర్తలు ఉత్సాహంగా టపాసులు పేల్చడం చేయడం జరుగుతుందని టపాసులు నిర్వహిస్తే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని గుర్తు చేశారు. కలెక్టర్ వారి ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై పీనల్ కోడ్ 1860 క్రింద 436 సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయాలను గుర్తించి ఓట్లలెక్కింపు రోజు శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని అన్నారు.

తిరుణాళ్లకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

మండలంలో నిర్వహించే తిరునాళ, జాతర్లకు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ శివకుమార్ సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జాతర్లలో బాణాసంచా పేల్చడం, డిజెలు, ఆర్కెస్ట్రా, రికార్డు డాన్స్‌లకు అనుమతి లేదన్నారు. చాందిని బండ్లలో మైకు సెట్లు పెట్టే నిర్వాహకులు తప్పని సరిగా డిఎస్‌పి దగ్గర ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఇళ్ల వద్ద అక్రమంగా బాణాసంచా నిల్వ చేసు కోకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో పోలీసుల అనుమతితో జాతరలు నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఆగామోహిద్దీన్

మళ్లీ వైసిపిదే అధికారం

ప్రజాశక్తి-కలికిరి

రాష్ట్రంలో మళ్లీ వైసిపి ప్రభుత్వమే వస్తుందని, ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిరెండవ సారి ప్రమాణ స్వీకారం చేస్తారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆగామోహిద్దీన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం ఆయన చింతల రామచంద్రారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ జరిగిన ఎన్నికల తీరును ఎమ్మెల్యే చింతలతో చర్చించి నియోజకవర్గంలో పాటు, మళ్లీ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రాబోతుందని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మళ్లీ అధికారంలోకి తీసుకవస్తాయని అన్నారు. కార్యక్రమంలో కబీర్ షాబుద్దీన్‌ఖాన్, ఇక్బాల్‌ఖాన్ పాల్గొన్నారు.

శివపురం గంగమ్మ తిరుణాల వాయిదా

ప్రజాశక్తి - మైదుకూరు

మండల పరిధిలోని శివపురంలో ఈ నెల 25 నుంచి జరగాల్సిన గ్రామ దేవత గంగమ్మ తిరుణాలను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి, గ్రామ పెద్దలు ప్రకటించారు. తిరుణాలను జూన్ నెలకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలతో పాటు బండ లాగుడు పోటీలకు వచ్చే ఎద్ల యజమానులు గమనించాలని వారు కోరారు.

పాస్‌పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా, రాయచోటి మండలం గొర్ల ముదివీడు గ్రామం, ఏనుపల్లి రోడ్ నెం0 5/32 బండి మోహిత్ ... పాస్ పోర్ట్ నెంబర్. 8548729, ... పాస్ పోర్ట్ నెంబర్. 1552884 ... 9502778030

బండి సుబ్బలు, ఫోన్ నెం: 9502778030

వయోజన బిసిజి టీకాతో క్షయ దూరం



కలకడ: వృద్ధురాలికి టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-కలకడ

వయోజన బిసిజి టీకాతో క్షయ వ్యాధిని దూరం చేయవచ్చని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యా ధికారి జవహర్‌బాబు పేర్కొన్నారు. క్షయ రహిత భారతదేశ లక్ష్య సాధన కొరకే వయోజన బిసిజి టీకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. గురువారం దొడ్డిపల్లి సచివాలయం పరిధిలోని కురవపల్లిలో నిర్వహిస్తున్న వయోజన బిసిజి టీకా సెషన్‌ను డాక్టర్ జవహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బిసిజి టీకా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 16న ప్రారం భించినట్లు తెలిపారు. టిబి మరణాల తీవ్రతను నివారించడంలో బిసిజి టీకా చాలా సురక్షితమైనదని, క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచ డానికి, పెద్దలలో టిబి నుంచి రక్షణ ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఎంతో ప్రయో జనం ఉందని అన్నారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా టీకా వేసుకో వాలని సూచించారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, పొగపీల్చువారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టిబి జబ్బుతో కోలుకున్న వారు, వారి కుటుంబ సభ్యులకు, టీకాకు అర్హులని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ జవహర్, ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, పిహెచ్ఎన్ సుబ్బరత్న, ఎఎన్ఎం వాణి. సి.లక్ష్మి దేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో క్షయ వ్యాధిని పూర్తిగా నివారించేందుకే ముందస్తుగా బిసిజి టీకా వేస్తున్నట్లు కోసవారిపల్లి పిహెచ్‌సి డాక్టర్ అనుపమ, డాక్టర్ మునికుమార్‌లు తెలిపారు. మండలంలోని 12 సచివాలయాల పరిధిలో రెండవ వారం బిసిజి వాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ఇప్పటివరకు మండలంలో 512 మందికివేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తంబళ్లపల్లి : బిసిజి టీకాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మునికుమార్

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు : డిఎస్‌పి



రామాపురం :సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రామచంద్రరావు

ప్రజాశక్తి-రామాపురం

ఎన్నికల కౌంటింగ్ కౌంటింగ్ రోజున గ్రామాల్లో అలజడలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి డిఎస్‌పి పి.రామచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో గురువారం మండలానికి సంబంధించిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా గ్రామాలలో అనుమానం వచ్చిన ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించామని అన్నారు. ఎన్నికల ఫలితాలు రోజున గ్రామాల్లో ఘర్షణలో లాంటివి చేసుకోవడం మంచిది కాదని అన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు, సంబరాలు, బాణ సంచా కాల్చడం వంటి వాటిని నిషేధించినట్లు తెలిపారు. జూన్ 6వ వరకు ఎన్నికల కోడ్ ఉంటుందని ప్రతి ఒక్కరూ దీన్ని దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ 4వ తేదీన ప్రజలు కౌంటింగ్ కేంద్రం వద్ద ఉండకుండా ఇంటి వద్దనే ప్రశాంతంగా టివిలలో చూసుకోవచ్చునని అన్నారు. ఎన్నికల ఫలితాలు రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని నలుగురు మించి ఒకచోట ఉండకూడదని అన్నారు. ఎలాంటి ఘర్షణలు చేసిన మీ పిల్లల భవిష్యత్తు నాశనమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సిఐ గంగనాథ్‌బాబు, ఎస్ఐ వి.ఎల్.ప్రసాద్ రెడ్డి, ఎఎస్ఐ శ్రీనివాస్ శర్మ, ఎస్‌బి కానిస్టేబుల్ రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గాలివీడు** :జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అయినా ఎటు వంటి అవాంఛనియ సంఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలు ఏ పార్టీ వచ్చినా అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో పాత ఘర్షణలు ఏమైనా ఉంటే వాటిని విడిచిపెట్టి ప్రశాంతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సిఐ జీవన్ గంగనాథ్‌బాబు ఎస్ఐలు మహేష్‌నాయుడు, వెంకటప్రసాద్, వైసిపి, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనలు అజరామరం



మాట్లాడుతున్న సింహయాజి

ప్రజాశక్తి-రాయచోటి

తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తనలు అజారామరమని స్వామీజీ సింహయాజి కొనియాడారు. అన్నమాచార్య 616 జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలోని కలెక్టరేట్ సమీపంలో గల శ్రీగుండాంజనేయస్వామి దేవాలయంలో అన్నమయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ తాళ్లపాక అన్నమయ్య కూడలిలో శ్రీ మంత్ర రాజపీఠం ఢిల్లీ స్వామీజీ శ్రీసింహయాజీ అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంగీత కళారత్నం శ్రీ యరగొల్ల శ్రీనివాస్ యాదవ్, మాస్టర్ భజన గురువు తుమ్మల హరినాథ్, అయ్యప్పస్వామి గురువు బసిరెడ్డితో పాటు రెడీ మేడ్ షాప్ యజమాని విజయ్, జనార్ధన్ పాల్గొన్నారు.32వేల సంకీర్తనలతో భగవంతుని గుణగణాలను కీర్తించి, శాశ్వతమైన బ్రహ్మపదాన్ని చేరుటకు ఈ నాటి సమాజానికి గొప్ప మార్గదర్శి అయ్యారని అన్నారు. కళాకారుల ఆధ్వర్యంలో కళాకారులు అత్యంత మనోహరంగా, శ్రవణా నందంగా అన్నమాచార్య సంకీర్తనలు గానం చేసారు. పలు భజన బృందాలు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. కళాకారులను స్వామీజీ సన్మానించారు. కార్యక్రమంలో వాయిద్యా సహకారం కీబోర్డ్ మాస్టర్ రామాంజనేయులు, తపలిస్ట్ నటరాజ్, కళాకారులు మల్లికార్జున, భాను,ఈశ్వర్, రాజశేఖర్,రెడ్డెన్న, రెడ్డికాంత, వనజ, సుహాసిని, నారాయణమ్మ,భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో చింతచిగురుకు భలే గిరాకీ



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆకులు రాలి చింత చిగురు కోతకు రావడంతో దానికి మంచి గిరాకీ ఉంది. ప్రతి ఏడాది ఏప్రిల్ చివరి నుంచి మే నెలాఖరుదాకా చింత చెట్లలో చిగురు వస్తుంది. గ్రామాల్లో ఎక్కువగా దీన్ని వినియోగించుకునే వారు. ఇప్పుడు పట్టణాల్లో కూడా చింతచిగురుకు మంచి క్రేజ్ పెరిగింది. సీజన్‌లో లభించే చింతచిగురుతో పప్పు, చారు తదితర వంటలు చేసుకుంటారు. నోరు ఊరూరించేలా చేసుకొని తినవచ్చు. గ్రామాల్లో అధికంగా చింతచెట్లు కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఇవి అందుబాటులో లేవు. తలుపుల, కొత్తపల్లి, యన్‌పి కుంట తదితర ప్రాంతాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల నుంచి చింతచిగురు పట్టణాల్లోని మార్కెట్లోకి వస్తోంది. చింతచెట్లు ఆకురాలిపోయి చిగురొచ్చింది. పలువురు చింతచిగురు పప్పు, చారును లొట్టలేసుకుని తింటుంటారు. దీంతో లేత చిగురు కోసం చింతచెట్ల వద్ద జనం కనిపిస్తున్నారు. చింతచెట్లకు ఎలాంటి క్రిమిసంహారక మందులు వాడరు. అంతేకాకుండా చింతచిగురులో సీ విటమిన్ పుష్కలంగా ఉంటుందని వైద్యులు చెపుతున్నారు. చింత చిగురులో ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషక విలువలు, ఔషధ గుణాలు ఉంటాయని న్యూట్రిషియన్లు చెబుతున్నారు. చింత చిగురులో ఎక్కువ ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పదార్థాలు ఉంటాయన్నారు. ప్రతి వంద గ్రాముల చిగురులో 5.8 గ్రాముల ప్రొటీన్లు, 10.6 గ్రాముల పీచు పదార్థం, 100 మిల్లీగ్రాముల కాల్షియం, 140 మి.గ్రా.ల ఫాస్పరస్, 26 మి.గ్రా.ల మెగ్నీషియం, విటమిన్-సి 3 మి.గ్రా.లు ఉంటుందని చెప్పారు. యాంటీ బాక్టీరియా వల్ల ఇన్ఫెక్షన్ తగ్గిస్తుందని యాంటీ డయాబెటిక్ లక్షణాలుండడం వల్ల మధుమేహం ఉన్న వారికి మేలు చేస్తుందని అన్నారు. కాలేయాన్ని రక్షించడంతోపాటు.. జీర్ణక్రియను, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. మనిషిలో నష్టపోయిన కణజాలాన్ని సరిచేస్తుంది. శరీరంలో కొల్లాజెన్ నిర్మాణం, ఐరన్ సంగ్రహణం, గాయాలు మానిపోయేలా చేస్తుంది. ముఖ్యంగా ఎముకలు, దంతాలు గట్టిగా ఉండేలా చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. చింత చిగురు, లేతవంకాయలు వేసి చారుకాచి రాగి సంగటితో కలిపి వడ్డిస్తే.. అబ్బో ఊహిస్తేనే నోట్లో నీళ్లురుతాయి. చింతచిగురు సీజన్ ఇక నెల రోజులు మాత్రమే ఉంటుంది. అందుకే ఈ సీజన్లో దొరికే చిగురు కోసం పట్టణ వాసులు ఆసక్తిని చూపుతారు. ఎండాకాలంలో బాడీ కూలింగ్ (శరీరం చల్లబడుట) అవడానికి ఎంతగానో ఉపకరిస్తుంది. కొందరు చింతచిగురులో ఉప్పు వేసుకుని రాయితో దంచుకుని తింటారు కూడా. పల్లెలో పిల్లలు వేసవి సెలవుల్లో ఊరి బయటకు వెళ్లి అక్కడున్న చింతచెట్లు ఎక్కి చిగురును కోస్తారు. వారు అక్కడే దంచుకుని తిని, కొంత ఇంటికి తెస్తారు. అలాగే పలువురు మహిళలు పప్పులో చింతాకు వేసేందుకు చెట్ల వద్దకెళ్లి కోసుకురావడం పల్లెల్లో పరిపాటి.

చింతచిగురు సేకరించడం కష్టం

చింత చెట్టు నుండి చింతచిగురు సేకరించడానికి ఎక్కువ మంది కూలీలు అవసరం. ఖర్చు కూడా పెరుగుతుంది. అంతేకాకుండా రోడ్ల విస్తరణతో చింత చెట్లు తొలగించారు. చింతచెట్లు పెంచడం తగ్గిపోవడంతో చింతచిరుగు దొరకడం కష్టమైంది. ఈ పరిస్థితుల్లో ధరలు పెంచాల్సి వస్తుంది.

- పుల్లమ్మ, చింతచిగురు వ్యాపారి

గతేడాది రూ.10కే చింతచిగురు

గతంలో రూ.10 ఇస్తే పప్పు కూరకు సరిపోయినంత చింతచిగురు వచ్చేది. చింతచెట్ల సంఖ్య తగ్గడంతో ధరలు పెంచారు. ప్రస్తుతం రూ.20 పెట్టాల్సి వస్తుంది.

- చింతలమ్మ, గృహిణి, పులివెందుల

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వైమానిక దళ విశ్రాంత అధికారి వెంకట కొండయ్య పేర్కొన్నారు. గురువారం పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు పొద్దుటూరు బాల బాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఆయన ముఖ్య అధితిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట కొండయ్య మాట్లాడుతూ గ్రంథాలయాల వల్ల విద్యార్థులు ఎంతో విజ్ఞానం సంపాదించుకోవచ్చు అన్నారు. గ్రంథాలయాలు విద్యార్థుల ఉన్నతస్థాయికి తోడ్పడతాయన్నారు. విద్యార్థులకు మెదడుకు మేత లాంటి అవగాహన కలిగించే ప్రశ్నలతో ఆకట్టుకున్నారు. అనంతరం దేశభక్తి గీతాలు పాడించారు. కార్యక్రమంలోగ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రం సాహెబ్, రెహ్మాన్ ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్ రాజారెడ్డికి ఘన నివాళులు

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి 26వ వర్థంతి వేడుకలను గురువారం పులివెందులలో వైసిపి నాయకులు ఘనం గా నిర్వహించారు. స్థానిక పాత ఎమ్మెల్యే కార్యా లయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పులివెందుల మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ అఫీస్, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్య కర్తలు పెద్ద ఎత్తున రాజారెడ్డికి నివాళులర్పించారు. వైఎస్ కుటుంబ సభ్యులు శ్మశాన వాటికలో రాజారెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.



పార్కులో సరదాగా ఆడుకుంటున్న పిల్లలు

హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి -బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సీలీహిల్స్ పర్యాటకులతో రద్దీగా మారింది. వేసవి సెలవులు కావడంతో బంధు మిత్రు లతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో సందడి చేశారు. పిల్లలు ఆటపా టలతో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా పలువురు పర్యాటకులు హార్సీలీహిల్స్ అందాలు ప్రకృతి రమణీయమని, వేసవి తాపం నుంచి ఉపశమనం లభించిం దన్నారు. పర్యాటకశాఖ అధికారులు అన్ని వసతులు కల్పించారు.ఇక వేసవి కాలం కావడంతో పర్యాటకులు నిరంతరం హార్సీలీహిల్స్ కు వచ్చి విశ్రాంతి తీసుకుంటారు.



తలముడిపిలో నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

తలముడిపి, కొర్లకుంటలో నాకాబందీ

ప్రజాశక్తి-గాలివీడు

ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతుండటంతో గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘాలు జరగకుండా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. కొర్లకుంట తలంముడిపి గ్రామాల్లోని వీధి వీధి ఇల్లు తనిఖీ చేసి సోదాలు చేశారు. గృహాల్లోనూ, గడ్డివాములు, ఇంటి పరిసరాలను క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటప్రసాద్, ఎఎస్ఐ అంజిరెడ్డి, రైటర్ అల్తాఫ్, పిసి ఇరగంరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి కలికిరి: పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 25 నుంచి జూన్ రెండు వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తెలిపారు. మే 27 నుంచి జూన్ 3 వరకు సహాయ కేంద్రాల్లో ధృవపత్రాలు పరిశీలిస్తారని, మే 31 నుంచి జూన్ 5 వరకు కేంద్రాలు ఎంపిక మార్పులు జరుగుతాయని, జూన్ 7న విద్యార్థి కేటాయించిన సీట్లను విడుదల చేస్తారని పేర్కొన్నారు.14వ తేదీ వరకు విద్యార్థులు తమ కేటాయించిన కేంద్రాలలో రిపోర్టింగ్ చేయాలని జూన్ 10వ తేది నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలు కొరకు 95055 04200 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సురేష్,అరుణకుమారి

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం గ్రామదేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా బ్రాహ్మణ వీధికి చెందిన ఉపాధ్యాయ దంపతులు సురేష్, అరుణకుమారిలు గురువారం పట్టువస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు రమణా రెడ్డి చేతులమీదుగా అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రతి సంవత్సరం అమ్మవారి జాతరకు పట్టు వస్త్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పద్మ, మహేంద్ర, ఆలయ చైర్మెన్ రామ్‌కుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, సభ్యులు బలరాం, పూజారి జనార్ధన్, భక్తులు పాల్గొన్నారు.

సహకార సంఘం బ్యాంకులో ఆధార్ కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె రైతు సేవా సహకార సంఘం బ్యాంకులో సభ్యులు తమ ఆధార్ కార్డును ఫోన్ నెంబర్‌తో కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని బ్యాంకు సిఇఒ జాన్ తెలిపారు. రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కంప్యూటరీకరణ చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ప్రతి సభ్యుడు అప్డేట్ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు మంజూరు కావన్నారు. సహకార సంఘం ఎన్నికలు జరిగినప్పుడు ఓటు హక్కును కోల్పోతారన్నారు. రుణాలపై ఇచ్చే వడ్డీ మాఫీకి కూడా అనర్హులవుతారని తెలిపారు. పంట నష్ట పరిహారం అందదని సూచించారు. ప్రతి రైతు కెవైసి తప్పక చేయించుకోవాలని జాన్ కోరారు.

పూల అంగళ్ల నుంచి వైఎస్ఆర్ జంక్షన్ వరకు వన్ వే

పులివెందుల రూరల్ : ఈనెల 27 నుంచి స్థానిక పూలఅంగళ్ల నుంచి పాత ఆర్‌టిసి బస్టాండ్ వైఎస్ఆర్ జంక్షన్ వరకు వన్ వే అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ట్రాఫిక్ సిఐ, ఎస్ఐ, ఆర్‌టిసి డిపో మేనేజర్, పలు సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వన్ వే అమలుకు వాహనదారులందరూ సహకరించాలన్నారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న తాత్కాలిక ఆక్రమణలను దుకాణాల యజమానులే తొలగించుకోవాలన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లోనే వాహనాల పార్కింగ్ చేసుకోవాలన్నారు. వ్యాపారులు ఏదేని వాణిజ్య సరుకు రవాణాను రాత్రి పది గంటల నుంచి ఉదయం ఆరు గంటల్లోగా అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్, ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముద్దనూరు : కడప-తాడిపత్రి రైలు మార్గంలోని ఓబుళాపురం గ్రామం సమీపంలో ఉన్న పట్టాలపై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారామిరెడ్డి తెలిపారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాలు ప్రకారం.. ముద్దనూరు- కొండాపురం వెళ్లే రైలు మార్గంలో ఓబుళాపురం గ్రామం వద్ద ఉన్న రైలు పట్టాలపై గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించినట్లు చెప్పారు. మృతుడు మాసిపోయిన పాత దుస్తులు ధరించి ఉన్నాడు. మృతదేహం రైలు పట్టాల మధ్యలో పడడంతో 3 గంటల పాటు రైళ్లు నిలిచి పోయాయి. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.